క్లుప్తంగా

ఘనంగా గ్యార్మీ వేడుకలు



జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు

మద్దికెర : స్థానిక మోమిన్ వీధిలోనున్న జెండా కట్ట వద్ద శుక్రవారం ముస్లింలు గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక మసీదులో హజరత్‌లు ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించి ఊరేగింపు చేపట్టారు. అనంతరం జెండాలను పురవీధుల్లో ఊరేగించారు. మాబుసుభానీ పుట్టినరోజు సందర్భంగా గ్యార్మీ వేడకలు చేయడం ఆనవాయితీ అని ముస్లిం పెద్దలు తెలిపారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



తలారి కృష్ణయ్య (ఫైల్)

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న తలారి కృష్ణయ్య (52) కిడ్నీ సమస్యతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈయన స్వగ్రామం కోడుమూరు మండలంలోని చనుగొండ్ల. ఈయన మృతి పట్ల మండలంలోని ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. ఈయన మండలంలోని నేలతలమరి, గుండ్లకొండ తదితర గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నిర్వాహకులు విజయ్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. డిసెంబర్ నెలలో జరిగే స్వామి వారి షష్టి ఉత్సవాలను పురస్కరించుకొని కార్మికులకు దుస్తులు అందజేశామన్నారు. అనంతరం స్వామి వారికి పూజలు చేసి ప్రసాదం పంపిణీ చేశారు.

సనాతన ధర్మాన్ని గౌరవించాలి

దేవనకొండ: సనాతన ధర్మాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని ఆర్ఎంపీ వెంకట్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని తిప్పతలమరి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గీతా పారాయణాన్ని బోధించి, భగవద్గీత విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ ధర్మం ప్రకారం నడుచుకోవాలని, దేవుని పట్ల, భగవద్గీత పట్ల నమ్మకాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను అందజేశారు. పులికొండ రామాంజనేయులు, తలమరి రంగస్వామి పాల్గొన్నారు.

హైటెన్షన్ తీగలను మార్చండి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మద్దికెర : ఇళ్లపై హైటెన్షన్ తీగలు ఉన్నందున నిత్యం భయాభ్రాంతులకు గురవుతున్నామని, వాటిని మార్చాలని సాయినగర్ కాలనీవాసులు మాబు, విశ్వనాథ్, శ్రీరాములు విద్యుత్ శాఖ అధికారులను కోరారు.ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఇళ్ల మీద తక్కువ ఎత్తులో తీగలు ఉన్నందున ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మిద్దె పైకి వెళ్తే తీగలనుంచి విద్యుత్ ప్రసరిస్తుందని, వెంటనే షాక్‌కు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం మేరకు మిద్దెలపైకి వెళ్లలేకపోతున్నానమని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తీగలను మార్చాలని కోరారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలో రాజీవ్‌నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని 1వ వార్డు సభ్యుడు సురేంద్రకుమార్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాలనీలో స్తంభాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలు లేక కాలనీలో అంధకారం నెలకొందని, రాత్రి పూట విష పురుగులు సంచరిస్తుండడంతో జనం బయటకు రాలేకపోతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కాలనీలో అంధకారం తొలగించాలని కోరారు.

మురుగు తొలగించండి



నిట్రవట్టిలో పేరుకుపోయిన మురుగు

హాలహర్వి: నిట్రవట్టి గ్రామంలో దుర్గమ్మవ్వ ఆలయం వద్ద నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం కురిస్తే నీరు నిల్వ చేరి రోజుల తరబడి ఉండిపోతుంది. దీంతో సమస్య మరింత తీవ్రగా మారుతోంది. నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. అధికారులు స్పందించి కాలనీలో డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం.. లక్ష్యం నిర్వీర్యం

రైతులకు స్థిరమైన ఆదాయం, భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని ప్రారంభించింది. 60 ఏళ్లు పైబడిన రైతులకు ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందజేస్తారు. ఇందుకు 18–40 ఏళ్ల లోపు వారు రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం ప్రతి నెల చెల్లించాల్సి ఉంటుంది. అయితే వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకానికి అర్హులైన రైతులున్నప్పటికీ అవగాహన కల్పించని కారణంగా.. ఈ పథకం గురించి మండలంలోని రైతాంగానికి తెలియకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

- చిన్న, సన్నకారు రైతుల కోసం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం అమలు
- 60ఏళ్ల పైబడిన అర్హులకు నెలకు రూ.3వేల పెన్షన్ అందజేత
- పథకానికి అర్హత ఉన్నా.. అవగాహన లోపంతో దూరమవుతున్న రైతులు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- ప్రీమియం చెల్లించని అన్నదాతలు
- నీరుగారుతున్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



హాలహర్వి: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుంది. ఇందులో సన్న,చిన్నకారు రైతులకు వృద్ధాప్యంలో జీవనోపాధి మరియు కనీస పొదుపు లేకుంటే వారికి సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని (పీఎంకేఎంవై) ప్రారంభించింది. ఈ పథకాన్ని ఎల్ఐసీ పెన్షన్ ఫండ్ నిర్వహిస్తుంది. ఈ పథకంలో 60 ఏళ్లు దాటిన వారికి ప్రతినెలా రూ.3 వేల పింఛన్ అందుతుంది. ఇందుకు వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అయితే రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. మండలంలో దాదాపుగా 20 వేలకు పైగా రైతులు ఉన్నారు. వ్యవసాయ అధికారులు 2021లో రైతులకు మొక్కుబడిగా అవగాహన కల్పించారు. ఆ తరువాత పట్టించుకోకపోవడం, పథకంపై రైతులను ప్రోత్సహించకపోవడంతో పథకం వర్తించక చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ఎంతమంది అర్హులు, ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో కూడా వ్యవసాయ అధికారుల వద్ద రికార్డులు లేకపోవడం గమనార్హం.

రూ.55తో ప్రీమియం ప్రారంభం..

ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకంలో చేరిన రైతులు నెలకు కనిష్టంగా రూ.55 నుంచి గరిష్టంగా రూ.200 వరకు చెల్లించాలి. ఏ వయస్సులో పథకంలో చేరారనే అంశం ప్రాతిపదికన చెల్లించాల్సిన మొత్తం ఆధారపడి ఉంటుంది. 18 ఏళ్లలో చేరితో నెలకు రూ.200 చెల్లించాలి. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెలా రూ.3 వేల చొప్పున లబ్ధిదారు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

అనర్హులు ఎవరంటే..

- చిన్న, సన్నకారు రైతులు, చట్టబద్ధమైన సామాజిక భద్రత పథకాల్లో ఉన్నవారు
- రాష్ట్ర ఉద్యోగ బీమా పథకం, ఎంప్లాయిమెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ స్కీంలో ఉన్నవారు
- ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజనంలో ఉన్న రైతులు, సంస్థాగత భూములు కలిగిన వారు
- రైతు కుటుంబంలో ఎవరైనా గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగ పదవిలో ఉన్నా, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు పదవీ విరమణ పొందిన వారు, రూ.10 వేలకు పైన పింఛన్ పొందుతున్న వారు.
- ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులు.

అర్హులు..

- ఐదు ఎకరాల్లోపు వయవసాయ భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు
- 18 – 40 ఏళ్లలోపు మాత్రమే ఉండాలి.
- భార్యాభర్తలు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయస్సు ఆధారంగా ప్రతినెలా రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాలి.
- రైతు చెల్లించే ప్రీమియంతో సమానంగా కేంద్రం వాటా కూడా చెల్లిస్తుంది.
- దరఖాస్తు చేసుకున్న వారు 60 ఏళ్లకు ముందుగానే మరణిస్తే చెల్లించిన మొత్తం వడ్డీతో సహా తిరిగి నామినీకి చెల్లిస్తారు.
- రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌లు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

తపాలా సేవలను వినియోగించుకోండి

హాలహర్వి: తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పీఎం భాస్కర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పోస్టల్ శాఖ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. జాతీయ తపాలా దినోత్సవం ముగింపు సందర్భంగా ప్రజలకు తపాలా సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు సుకన్య ఖాతాను ఉపయోగించుకోవాలన్నారు. పొదుపు ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆర్‌డీ ఖాతాలు అందుబాటు ఉన్నాయని, మంచి వడ్డీ రేటు లభిస్తుందని చెప్పారు. గ్రామ పోస్టుమాస్టర్‌లు, సిబ్బంది ఉన్నారు.

14 మద్యం షాపులకు 296 దరఖాస్తులు

పత్తికొండ(తుగ్గలి) : ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పత్తికొండ సర్కిల్ పరిధిలోని 14 మద్యం షాపులకు 296 దరఖాస్తులు అందాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. పత్తికొండ మండలంలో ఐదు మద్యం దుకాణాలకు 40 దరఖాస్తులు, దేవనకొండ మండలంలో మూడు దుకాణాలకు 147 దరఖాస్తులు, తుగ్గలి మండలంలో రెండు దుకాణాలకు 20 దరఖాస్తులు, గోనెగండ్లలో మూడు దుకాణాలకు 71 దరఖాస్తులు, మద్దికెర మండలంలో ఒక దుకాణానికి 18 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయిప్రవీణ్ తెలిపారు. దేవనకొండ మండలం 92వ దుకాణానికి అత్యధికంగా 54 దరఖాస్తులు, 93 దుకాణానికి 49 దరఖాస్తులు రాగా, అతి తక్కువగా పత్తికొండలో 89, 90 దుకాణాలకు ఒక్కో దానికి 7 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

ఘనంగా ఆయుధ పూజ



రాజా పంపన్నగౌడ్ నివాసంలో ఆయుధ పూజ చేసిన దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది



కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది



పత్తికొండ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజల్లో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీ, టౌన్ సీఐ

హొళగుంద: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో ఆయుధ పూజా ఘనంగా జరిగింది. ఆయా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇళ్లల్లో రికార్డులు, ఆయుధాలకు పూజలు చేశారు. హొళగుందలో రాజ వంశీకులైన మాజీ సర్పంచ్ రాజా పంపన్నగౌడ్ నివాసంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు.

మద్దికెర : మండల కేంద్రంలో విజయదశమి సందర్భంగా శుక్రవారం విద్యుత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలలో భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ నిర్వహించారు. నిత్యం వారు ఉపయోగించే పనిముట్లను శుభ్రం చేసి అలంకరించి, స్వామి వార్ల చిత్రపటాల వద్ద ఉంచి ప్రత్యేకంగా పూజలు చేశారు.

కృష్ణగిరి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం దసరా పండుగను పురస్కరించుకొని మహర్నవమి సందర్భంగా ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో కలిసి ఆయుధ పూజ చేశారు.అలాగే కృష్ణగిరి, కంబాలపాడు, ఆగవేలి, చిట్యాల, లక్కసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ ఏఈ మద్దిలేటి సిబ్బందితో కలిసి ఆయుధ పూజ చేపట్టారు.

ప్రజలందరికీ విజయాలు చేకూరాలి

పత్తికొండ(తుగ్గలి) : ఈ విజయదశమి శుభదినం ప్రజలందరికీ విజయాలు చేకూరాలని ట్రైనీ డీఎస్పీ ఉషాశ్రీ , అర్బన్ సీఐ జయన్న ఆకాంక్షించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయుధ, వాహన పూజతో పాటు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలు కృష్ణమూర్తి, జయశేఖర్ ఆయుధపూజ జరిపించారు. కార్యక్రమంలో పత్తికొండ ఎస్ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బన్ని ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- భారీ బందోబస్తు ఏర్పాటు



ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టు కొండల్లో కొలువుదీరిన శ్రీ మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమని పండుగ సందర్భంగా రాత్రి 1–20 గంటలకు బన్నీ ఉత్సవం (కర్రల సమరం) ప్రారంభమవుతుందని, ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్ శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బన్ని ఉత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఏడుగురు డీఎస్పీలు, 42 మంది సీఐలు, 54 మంది ఎస్ఐలు, 112 మంది ఏఎస్ఐలు, 365 మంది పోలీసులు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 3 ప్లటూన్లు పోలీసులు, 95 మంది హోంగార్డులను బందోబస్తుకు నియమించారన్నారు. ఇప్పటికే పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో దాదాపు 20 గ్రామాల్లో నాటుసారా తాగి గట్టు ఉత్సవాలకు హాజరుకావద్దని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. నాటుసారా తయారీదారులు, రింగుల కర్రలను స్వాధీనం చేసుకోవడం. పలు గ్రామాల్లో పాత నేరస్తులను ఆదుపులోకి తీసుకున్నామని చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, 4 అగ్నిమాపక కేంద్రం వాహనాలు, 108 అంబులెన్స్‌లు 4 అందుబాటులో ఉంటాయన్నారు. కాగా.. శనివారం రాత్రి 1–20 గంటలకు గట్టులో జరగనున్న ఉత్సవం తిలకించేందుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, వివిధ మండలాల తహసీల్దార్లు పర్యటిస్తారని ఆలూరు రెవెన్యూ కార్యాలయ అధికారులు తెలిపారు.

జయ జయహే మహిషాసురమర్దిని



మహిషాసుర మర్దినిగా వాసవీ మాత



మహిషాసుర మర్దినిగా సరస్వతీదేవి



తుగ్గలిలో మహిషాసుర మర్దినిగా దుర్గామాత





మహిషాసుర మర్దిని అలంకారంలో గాయత్రీ మాత, పెద్దమ్మవ్వ



మహిషాసురమర్దినిగా రాజ్యలక్ష్మి

పత్తికొండ(తుగ్గలి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో కనుల పండువగా సాగుతున్నాయి. పత్తికొండ కన్యకాపరమేశ్వరి దేవి, సాయిబాబా ఆలయాల్లో వాసవీమాత, సరస్వతీ దేవి శుక్రవారం మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తుగ్గలిలో దుర్గామాత మహిషా సురమర్దినిగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు ఉదయం నుంచి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆస్పరి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రామతీర్థంలోని పంచముఖి గాయత్రీ మాత, పార్వతీదేవి, జొహరాపరంలో పెద్దమ్మవ్వ మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో వెలసిన కన్యకాపరమేశ్వరి, మారెమ్మవ్వ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. జొహరాపురంలో లక్ష్మీదేవి అలంకారంలో మారెమ్మవ్వ దర్శనమిచ్చిరు.

మద్దికెర : శరన్నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పెరవలి శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రంగనాథస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వార్లకు పల్లకోత్సవం జరిపించారు.

ఆలూరు: దేవీశరవన్నరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని ఆలయ అర్చకులు మహేంద్ర ఆచార్ నవ దుర్గగా అలంకరించి విశేష పూజలు జరిపించారు.





వెల్దుర్తిలో మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి, భువన గాయత్రీ దేవి



హొళగుందలో ఆకు పూజా లంకరణలో దేవమ్మ



మహిషాసురమర్దినిగా దుర్గామాత

హొళగుంద: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా మండలంలో శుక్రవారం హొళగుంద, వందవాగిలి గ్రామాల్లో వెలిసిన దేవమ్మ, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో పండితులు భక్తులకు పురాణ ప్రవచనం చేశారు.



జొహరాపురంలో లక్ష్మీదేవిగా మారెమ్మవ్వ



ఆలూరులో నవదుర్గ అలంకరణతో వాసవీదేవి

కృష్ణగిరి: జయ జయహే మహిషాసురమర్దిని అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవీ శవన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా 9వ రోజు శుక్రవారం మహిషాసురమర్దిని రూపంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. కటారుకొండ గ్రామంలో దుర్గామాత మహిషాసుర మర్దినిగా, వెల్దుర్తిలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి, భువన గాయత్రీ దేవి మహిషాసురమర్దిని ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలు, కుంకుమార్చన, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు.

పండగ సందడి





మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన బంతిపూలు,దసరా సంత కోసం హొళగుందకు వచ్చిన గ్రామాల బైక్‌లు

హొళగుంద: శనివారం దసరా పండగ ఉండడంతో స్థానిక బస్టాండు ప్రాంతం సందడిగా మారింది. పండుగ సంత కోసం పల్లెల నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చారు. ఆయా గ్రామాల నుంచి జనం సొంత వాహనాల్లో వచ్చారు. దీంతో బస్టాండు ఆవరణ బైక్‌లతో నిండిపోయింది. పండగ సంతకు ప్రజలు భారీగా తరలి రావడంతో వ్యాపారులు సరుకుల ధరలను పెంచి విక్రయించారు. కిలో బంతి పూలు రూ.120 ధర పలికాయి. 15 లీటర్ల వంట నూనె డబ్బాను రూ.2,200 కు విక్రయించారు. టెంకాయ రూ.30 ప్రకారం అమ్మారు. మండలంలో రైతులు అధిక శాతం పత్తి పంట సాగు చేశారు. ఇటీవల దిగుబడిని విక్రయించగా.. మంచి ధర లభించడంతో అన్నదాతల మోము కళకళలాడుతోంది.

నిబంధనలు బేఖాతారు

- ఎంపీపీ ఆమోదం లేకుండా అభివృద్ధి పనులకు తీర్మానం
- రూ.1.80 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ప్రజాప్రతినిధులకు తెలియకుండా సొంతంగా నివేదిక పంపిన అధికారులు
- జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య

చిప్పగిరి: సాధారణంగా..మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు.. వాటి పరిష్కారానికి అవసరమైన నిధులపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించి తీర్మానం చేసిన తరువాత ఎంపీపీ ఆమోదంతో అధికారులు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం ఆనవాయితీ. అయితే ఇక్కడ మాత్రం అలాంటివేమీ లేకుండా ఎంపీపీ ఆమోదం లేకుండా సొంతంగా తీర్మానం రూపొందించి కొన్ని గ్రామాలకు మాత్రమే నిధులు మంజూరు చేయించారు అధికారులు. నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో.. ఇదెలా జరిగిందని ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. ఈ ప్రక్రియకు చిప్పగిరి మండలం కేంద్రంగా మారింది. వివరాలు..మండలంలో 13 గ్రామ పంచాయతీలు 3 మజరా గ్రామాలతో కలిపి మొత్తం 16 గ్రామాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు 28న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ జూటూరు హేమలతకు తెలియకుండా తప్పుడు సమాచారంతో తమకు తోచిన గ్రామాలకు నిధుల మంజూరు కోరుతూ మూడు గ్రామాలను వదిలేసి అప్పటి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు (ప్రస్తుత సూపరింటెండెంట్) తీర్మానం పంపారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.1.80కోట్లు విడుదలయ్యాయి.

నాకు తెలియకుండా తీర్మానం ఎలా పంపుతారు?




నాకు తెలియకుండా మండలానికి సంబంధించిన అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు ఎలా తీర్మానం పంపుతారు. మండల అధ్యక్షురాలికి కనీస సమాచారం లేకుండా నిధులు ఎలా కోరతారు. మండలంలోని గ్రామాల్లో స్థితిగతులు ,ఏ గ్రామానికి ఏమి అవసరమో తమకు పూర్తి అవగాహన ఉంది. అలాంటప్పుడు అభివృద్ధి నిధులు కోరే తీర్మానంలో తన ప్రమేయం లేకపోతే ఎలా? అన్ని గ్రామాలకు నిధులు కోరి, మూడు గ్రామాలను వదిలేయడంలో ఆంతర్యమేంటి? ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరతాం. – జూటూరు హేమలత, ఎంపీపీ

ఎంపీపీ అనుమతితోనే తీర్మానం పంపాం



మండలంలోని గ్రామాలకు సంబంధించి అభివృద్ధి నిధులు మంజూరు కోరుతూ ప్రతి తీర్మానం ఎంపీపీ అనుమతితోనే పంపాం. తీర్మానంలో లేని గ్రామాల సర్పంచులు తమ గ్రామాలకు నిధులు కోరకపోవడంతో తీర్మానం చేసిన జాబితాలో వారి గ్రామాలు లేవు. నిధుల కేటాయింపులో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న ఎంపీడీఓ దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తాం.. – శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ



104	Providing CC roads and CC drains from Mallaiah house to Gangamma house and other Connecting roads at Nagaradona Village of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
105	Providing CC roads and CC drains Near Kotha gen and other Connecting roads at Nagaradona Village of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
106	Providing CC roads and CC drains from Mangamma temple to [illegible] house and other Connecting rs at Thimmapuram Village [illegible] Nagaradona GP of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
107	Providing CC roads and CC drains from [illegible] to [illegible] and other Connecting roads at Beltona Village of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
108	Providing CC roads and CC drains from [illegible] house to [illegible] house and other Connecting roads at [illegible] Village of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
109	Providing CC roads and CC drains from K.Mahesh house to [illegible] house and other Connecting roads at [illegible] Village of Chippagiri Mandal Estt. Cost : 5.00 Lakhs
110	Providing CC roads and CC drains from [illegible] Temple to [illegible] temple and other Connecting roads at [illegible] Village of Chippagiri Mandal. Estt. Cost : 5.00 Lakhs
111	Providing CC roads and CC drains at BC Colony and other Connecting roads at [illegible] Village of Chippagiri Mandal. Estt. Cost : 10.00 Lakhs
112	Providing CC roads and CC from Anjaneyaswamy temple to [illegible] and other Connecting roads at Kundhanagurthy Village of Chippagiri Mandal Estt. Cost : 10.00 Lakhs
113	Providing CC roads and CC from [illegible] house to [illegible] Ramachandra house and other Connecting roads at Kundhanagurthy Village of Chippagiri Mandal Estt. Cost : 10.00 Lakhs
114	Providing CC roads and CC from MPP School to [illegible] house and [illegible] house and other Connecting roads at [illegible] Village of Chippagiri Mandal Estt. Cost : 10.00 Lakhs

Mandal [illegible] Officer, MPP, CHIPPAGIRI — Sd/- J.Hemalatha, Mandal President, MPP, CHIPPAGIRI

ఎంపీపీ సంతకం లేకుండా పంపిన తీర్మాన పత్రం

నిధులు ఆమోదం పొందిన గ్రామాలు..

చిప్పగిరి రూ.40 లక్షలు, రామదుర్గం రూ.20లక్షలు, నేమకల్లు రూ.20లక్షలు, నగరడోణ రూ.20 లక్షలు, తిమ్మాపురం, బెల్డోణ,బంటనహాలు,ఏరూరు,దౌల్తాపురం,డేగులహాలు గ్రామాలకు రూ. 10 లక్షల చొప్పున, కుందనగుర్తి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. తీర్మానంలో లేని గ్రామాలు గుమ్మనూరు,కాజీపురం,కొట్టాల,నంచర్ల ఉన్నాయి. వీటికి నిధులు కేటాయించలేదు.

దసరా వేడుకలకు సిద్ధం



తుగ్గలిలోని జమ్మిచెట్టు వద్ద కల్లాపి చల్లుతున్న దృశ్యం

తుగ్గలి : దసరా పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. విజయదశమి పురస్కరించుకుని ఇళ్లను, ఆలయాలను బంతిపూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ఆలయాల వద్ద నిర్వహించే అపరాజితాదేవి పూజ కోసం జమ్మిచెట్ల వద్ద ఏర్పాట్లు సిద్ధం చేశారు. దసరా పర్వదినాన జమ్మిచెట్టును అపరాజిత దేవిగా భావిస్తూ భక్తులు పూజించడం సంప్రదాయంగా వస్తోంది. ‘శమీ శమయితే పాపం శమీ శత్రు వినాశనీ అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శనం’ అనే శ్లోకాన్ని చదువుతూ భక్తులు జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇలా చేయటం వల్ల అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని, శని దోషాలు పోతాయని నమ్ముతారు. జమ్మి ఆకులను తీసుకుని పెద్దల చేతిలో పెట్టి వారి ఆశీర్వాదం పొందుతారు. పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో శమీ (జమ్మి) పూజ నిర్వహించేందుకు జమ్మి చెట్ల వద్ద కల్లాపి చల్లి ఏర్పాట్లు చేశారు.